# వరికి 'బోనస్' ఉరి!

మొదటిపేజీ తరువాయి...

ఆలోచన కూడా ఉన్నదని తెలుస్తున్నది.

### వరిపైనే తొలి దెబ్బ

మంత్రి పేర్కొన్నట్టు ఇతర పంటల సాగును పెంచితే దాని ప్రభావం తొలుత పడేది వరిసాగుపైనేనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. రాష్ట్రంలోని మొత్తం పంటల సాగులో 75 శాతం మూడు పంటలకే పరిమితమైందన్న మంత్రి వ్యాఖ్యల్లో నిజముంది. దీనివెనక ఒక కారణం కూడా ఉన్నది. ఇతర పంటలకు సరైన మద్దతు ధర రాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నది అన్నదాతల మాట. ఇతర పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ఆయా పంటల సాగును పెంచే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అప్పుడు ఇతర పంటల సాగును పెంచేందుకు వరి, పత్తిసాగును తగ్గించాల్సి ఉంటుంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో వరి, పత్తిసాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. మరీ ముఖ్యంగా కాళేశ్వరం పూర్తయ్యాక వరి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. 2014-15లో 34 లక్షల ఎకరాలున్న వరిసాగు విస్తీర్ణం, 2022-23లో ఏకంగా 1.21 కోట్ల ఎకరాలకు పెరిగింది. గత వానకాలంలో వానకాలంలో 1.36 కోట్ల ఎకరాల్లో పంటలు సాగుకాగా, అందులో వరి 64.54 లక్షల ఎకరాల్లో, పత్తి 50 లక్షల ఎకరాల్లో సాగైంది. మొత్తం పంటల సాగులో ఈ రెండింటి వాటా ఏకంగా 84 శాతం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి చెప్పిన ఆ రెండు పంటలు వరి, పత్తేనని స్పష్టమవుతున్నది. ఈ నేపథ్యంలో ఇతర పంటల సాగును పెంచాలంటే వరి, పత్తిసాగుపై ఆంక్షలు పెట్టక తప్పని పరిస్థితి ఎదురవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

### బోనస్, కరెంట్, నీళ్ల నుంచి తప్పించుకునేందుకేనా?

మద్దతు ధర సాకుతో ఇతర పంటలను ప్రోత్సహించి వరి, పత్తిని తగ్గించాలనే ఆలోచన వెనుక పెద్ద కుట్ర ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరి సాగు ఇలాగే కొనసాగినా, ఇంకా పెరిగినా కాంగ్రెస్ ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురవుతాయని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బోనస్, సాగు నీళ్లు, కరెంట్ రూపంలో ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని అంటున్నారు. వరి సాగు పెరిగితే ప్రభుత్వానికి ఆర్థికంగా మరింత భారం పెరుగుతుంది. సాగు నీళ్లు, కరెంట్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే మేడిగడ్డలో పిల్లర్లు కుంగిపోయాయనే సాకుతో ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు పొలాలకు అందకుండా చేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులోనైనా కాళేశ్వరం ద్వారా నీళ్లు అందిస్తారో, లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది. వరిసాగుకు అవసరమైన విద్యుత్తు కూడా ఈ ప్రభుత్వం సరఫరా చేస్తుందో లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ప్రతిఏటా కనీసం కోటి టన్నుల ధాన్యం కొనుగోలు చేసినా బోనస్ కోసం ఏకంగా రూ. 5 వేల కోట్ల నిధులు అవసరం అవుతాయి. ఈ విధంగా బోనస్ వల్ల వచ్చే ఆర్థిక భారం, కరెంట్, నీళ్లు ఇవ్వడం నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం వరిసాగుపై ఆంక్షలు పెట్టేందుకు సిద్ధమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రైతులకు మళ్లీ కష్టాలు

ఒకవేళ ఇతర పంటలను ప్రోత్సహించి వరిసాగును తగ్గిస్తే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ సంస్కరణలతో రైతులు భరోసాగా బతుకుతున్నారు. పుష్కలంగా నీళ్లు, సాగుకు అవసరమైన కరెంట్, రైతుబంధు పెట్టుబడి సాయం, సకాలంలో ఎరువుల పంపిణీ.. ఇలా అన్ని విధాలుగా రైతులకు అనుకూల పరిస్థితులున్నాయి. సాగునీళ్లు, కరెంటు ఇవ్వడంతో రైతులు వరి సాగుకు మొగ్గుచూపారు. ప్రతి రైతుకు ప్రతి సీజన్‌లో ఆరు నెలలు తిరగకముందే వరి సాగుతో రూ. లక్షల ఆదాయం వస్తున్నది. దీంతో పాటు ఒకప్పుడు బుక్కెడు బువ్వ కోసం ఎదురు చూసిన తెలంగాణ ప్రజలు ఇప్పుడు దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగారు. దేశానికి తెలంగాణ అన్నపూర్ణగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు వరిసాగుపై ఆంక్షలు పెడితే రైతుల బతుకులు ఆగం కావడంతో పాటు తెలంగాణ మళ్లీ ఆకలికి ఏడ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే అందోళన వ్యక్తమవుతున్నది.



సూర్యాపేట జిల్లా గుంపుల గ్రామంలో ప్రజలతో ముఖాముఖిలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య

## కేసీఆర్ ఉన్నప్పుడు నీళ్లకు తిప్పలు లేకుండే

**మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో ముఖాముఖిలో 'గుంపుల' గ్రామస్థులు**

చివ్వెంల, మే 5 : 'కేసీఆర్ అధికారంలో ఉన్నన్నీ రోజులు మాకు నీళ్ల తిప్పలు లేకుండే. ఇప్పుడు సాగు నీళ్లు కాదు కదా తాగు నీళ్లకూ సమస్య వచ్చింది. నాలుగు వేల పింఛన్ ఇస్తానన్న రేవంత్‌రెడ్డి , రెండు వేలే సక్కగా ఇస్తలేడు' అని సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంపుల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆదివారం ఆ గ్రామంలో బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, రైతులు, పలు వర్గాల ప్రజలు జగదీశ్‌రెడ్డితో తమ సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసాన్ని ప్రజలు గ్రహించినట్టు తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, రాష్ట్రంలో ఎవరికి ఏమి కావాలో తెలిసిన నేత కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో రెండు పంటలకు సాగునీరిచ్చామని, దేశంలోనే వరి ఉత్పత్తిలో నంబర్ వన్‌గా నల్లగొండ జిల్లా నిలిచిందని గుర్తుచేశారు. సరిపడా నీళ్లు ఉన్నా పంటలు ఎండబెట్టిన పాపం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన విమర్శించారు. ప్రజలంతా గులాబీ జెండాకు అండగా నిలబడి, జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## నీట్ కటాఫ్ తగ్గే ఛాన్స్

- టాప్ ర్యాంకులకు ఫిజిక్స్ ప్రామాణికం

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : ఈ సారి నీట్ ర్యాంకులను ఫిజిక్స్ ప్రశ్నలు నిర్దేశించనున్నాయి. ఫిజిక్స్ ప్రశ్నలను ఛేదించిన వారే మంచి ర్యాంకును పొందే అవకాశం ఉన్నది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్-యూజీ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. ఈ పరీక్షలో ఫిజిక్స్ పేపర్ ప్రశ్నలు కఠినంగా ఉండటంతో విద్యార్థులు కాస్త ఇబ్బందిపడ్డారు. కానీ, మొత్తంమీద నీట్ పేపర్ మధ్యస్థంగా ఉన్నట్టు నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ సారి అత్యధికంగా ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ సిలబస్ నుంచే ఇచ్చారు. ఎప్పుడూ కఠినంగా ఉండే కెమిస్ట్రీ సులభంగా ఉండగా, జీవశాస్త్రంలో జువాలజీ, బాటనీ సెక్షన్ల ప్రశ్నలు కూడా ఈజీగా ఉన్నట్టు విద్యార్థులు చెప్పారు. బాగా చదివిన వారు, మరీ ముఖ్యంగా ఎన్సీఈఆర్టీ పుస్తకాలు, సిలబస్ చదివిన వారు మెరుగైన స్కోర్ చేస్తారని నిపుణులు అంచనావేశారు. అయితే, నిరుటితో ఈ సారి పేపర్‌ను పోల్చితే కాస్త కఠినంగా ఉన్నట్టు లెక్చరర్లు అంచనా వేశారు.

### కటాఫ్ తగ్గే అవకాశం

ఈ సారి ఫిజిక్స్ ఆధారంగా ర్యాంకులను నిర్ణయించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గతంలోనే ప్రకటించింది. గత రెండు మూడేండ్లుగా కెమిస్ట్రీని ప్రామాణికంగా తీసుకొని ర్యాంకులను వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది ఫిజిక్స్ కఠినంగా రాగా, ఈ నేపథ్యంలో ఒకే మార్కుపై ఉండే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిరుడు 700- 720 మధ్య మార్కులు పొందిన వారు అధికంగా ఉండగా, ఈ సారి ఆ పరిస్థితి ఉండకపోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది కన్వీనర్ కోటా సీట్లు పెరగడం, పేపర్ కఠినంగా రావడంతో తెలంగాణలో జనరల్ కటాఫ్ 430 -440 మార్కుల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఇక రిజర్వ్‌డ్ క్యాటగిరీ విద్యార్థుల కటాఫ్ 350 వరకు ఉండొచ్చని పేర్కొంటున్నారు.

### ఓ సెంటర్‌లో ఆలస్యంగా పేపర్

నీట్ పరీక్ష సందర్భంగా పలు పరీక్షాకేంద్రాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా టీచర్లు ముచ్చటించుకోవడంతో విదార్థుల ఏకాగ్రతపై ప్రభావం చూపింది. ఇక మాదాపూర్‌లో ఓ పాఠశాల సెంటర్‌లో ఇన్విజిలేటర్ 20 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నపత్రాన్నిచ్చారు. దీంతో ఆయా సెంటర్‌లోని 50 మంది విద్యార్థులు 20 నిమిషాల విలువైన సమయాన్ని కోల్పోయారు. ఇన్విజిలేటర్ వాచ్ ఆగిపోవడం, ఇది చూసుకోకుండా టీచర్ ప్రశ్నపత్రాలివ్వకపోవడంతో తమకు నష్టం వాటిల్లిందని విద్యార్థులు వాపోయారు.

## ఎంజీఎంలో ఏసీలకు మరమ్మతులు

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**




వరంగల్ ఎంజీఎంలో ఏసీలను రిపేర్ చేస్తున్న టెక్నీషియన్

పోచమ్మమైదాన్, మే 5: వరంగల్ ఎంజీఎం దవాఖానలో ఏసీలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'దవాఖానల్లో పనిచేయని ఏసీలు' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. డీఎంఈతో పాటు మెడికల్ అండ్ హెల్త్ సెక్రటరీ ఆదేశాలకు మేరకు పీడియాట్రిక్ యూనిట్ ఐసీయూ/హెచ్‌డీయూ వార్డుల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. ఎంజీఎంతోపాటు మార్చురీ గదిలో కూడా ఏసీలకు మరమ్మతులు చేశారు. దవాఖానలో పిల్లలకు ఇబ్బందులు కలుగకుండా ఏసీలను రిపేర్ చేయిస్తున్నట్టు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మార్చురీలోని ఫ్రీజర్ల మరమ్మతుతోపాటు ఆవరణ మొత్తం పరిశుభ్రం చేయించినట్టు ఆయన వివరించారు. ఇక్కడ రోగుల కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని సూపరింటెండెంట్ చెప్పారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

## నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రూ.200 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 25 వరకు ఫస్ట్ ఫేజ్ ప్రక్రియను చేపట్టనున్నారు. ఈసారి దోస్త్ యాప్‌లో సెల్ఫీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశాన్ని కల్పించారు. విద్యార్థులు మే 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. జూన్ 3న మొదటి విడత సీట్లను కేటాయిస్తారు. రాష్ట్రంలోని 1066 కాలేజీల్లో మొత్తం 4,49,449 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడు విడతల్లో దోస్త్ ప్రక్రియను పూర్తిచేస్తారు.

















